క్లుప్తంగా

ఇస్కాన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో రాధాకృష్ణులు

కొమ్మాది: సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో ఆదివారం వారాంతపు పూజల్లో భాగంగా హరే కృష్ణ, హరేరామ నామస్మరణతో ప్రత్యేక పూజలు చేశారు. రాధాకృష్ణులు, సుభద్ర, బలభద్ర, జగన్నాథుడు, సీతారాములు, ఆంజనేయ, నరసింహస్వామి విగ్రహాలను వివిధ వర్ణాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారి లీలలు, మహిమలను వర్ణిస్తూ భక్తులు భజనలు, గీతాలాపన చేశారు.

ముగ్గురు కాంట్రాక్ట్ అధ్యాపకుల నియామకం

తగరపువలస: చిట్టివలస ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు కాంట్రాక్ట్ పద్ధతిలో ముగ్గురు అధ్యాపకులను నియమించినట్టు ప్రిన్సిపాల్ (ఎఫ్ఏసీ) డాక్టర్ ఐ.విజయబాబు తెలిపారు. కళాశాల విద్యాశాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు వాణిజ్య శాస్త్రం, రసాయన శాస్త్రం, గణితం సబ్జెక్టుల బోధనకు అధ్యాపకులను నియమించినట్టు తెలిపారు. మిగిలిన సబ్జెక్టులకు అతిథి అధ్యాపకులను నియమించడానికి తీర్మానం చేశామని తెలిపారు.

విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు



సంతపేటలో విద్యార్థుల నేత్రాలు పరీక్షిస్తున్న వైద్యులు

తగరపువలస: సంతపేట అంబేడ్కర్ జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆదివారం మొహసిన్ స్కూల్ హెల్త్ ఐ కేర్ ప్రాజెక్ట్ తరఫున విశాఖ కంటి ఆస్పత్రి, సత్యసాయి సేవా సంస్థలు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించాయి. ఇందులో 135 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఆరోగ్యవంతమైన కళ్ల కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మొకర పద్మావతి, ఉపాధ్యాయుడు డీవీ రమేష్, సత్యసాయి సేవా సంస్థల జోనల్ కో ఆర్డినేటర్ మానాపురం వెంకట సత్య సాయికుమార్, ఆధ్యాత్మిక కో ఆర్డినేటర్ టీవీ ఆర్ బాబా, సీహెచ్ వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ఎండాడ పాఠశాలకు క్రీడా పురస్కారం

కొమ్మాది: జీవీఎంసీ 8వ వార్డు ఎండాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌కు 2022 – 23 విద్యా సంవత్సరానికి క్రీడా ప్రతిభ పురస్కారం లభించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పరిపూర్ణ తెలిపారు. జిల్లాలో స్కూల్ గేమ్స్‌లో అత్యధికంగా రాష్ట్ర స్థాయి క్రీడల్లో పాల్గొనడం, పతకాలు సాధించడం వల్ల పాయింట్ల ఆధారంగా పురస్కారం లభించినట్లు తెలిపారు. ఈ నెల 29న నేషనల్ స్పోర్ట్స్ డే సందర్భంగా డీఈవో చంద్రకళ చేతుల మీదుగా అవార్డు తీసుకుంటామని ఆమె తెలిపారు.

మంగమారిపేటలో అంధకారం

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు మంగమారిపేట రామాద్రి కాలనీలో గత నెల రోజుల నుంచి వీధిలైట్లు లేక స్థానికులు అంధకారంలో అవస్థలు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున కొండ ప్రాంతం కావడంతో పాములు వస్తుంటాయని..., ఇలాంటి తరుణంలో వీధి లైట్లు లేకపోవడం వల్ల రాత్రి సమయాల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు వాపోతున్నారు. దీనిపై స్థానిక నాయకులకు, అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని... ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

ఇళ్ల ముంగిట మురుగు



కృష్ణాకాలనీలో మురుగుతో నిండిన డ్రైనేజీ



ఇంటి గేటు ముందు నాచుకట్టిన మురుగు



డ్రైనేజీ నిర్మించిన చోట వదిలేసిన నిర్మాణ సామగ్రి

- కృష్ణాకాలనీలో అసంపూర్తిగా డ్రైనేజీలు, రోడ్ల నిర్మాణం
- స్థానికులకు తప్పని ఇబ్బందులు

తగరపువలస: జీవీఎంసీ 3వ వార్డు కృష్ణాకాలనీలో అసంపూర్తిగా నిర్మించి వదిలేసిన డ్రైనేజీలు, సీసీరోడ్ల కారణంగా భీమిలి – దొరతోట రహదారి పక్కన ఉన్న కుటుంబాలు దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాయి. ఒకరిద్దరు వ్యాధుల బారినపడి మంచం పట్టారు. కొండవాలు ప్రాంతం నుంచి నిర్మించిన సీసీరోడ్లు, డ్రైనేజీలను భీమిలి రోడ్డులో తూర్పు వైపు ఖాళీ స్థలాల యజమానులు అడ్డుకున్నారు. దీంతో కాంట్రాక్టర్ వీటిని అర్ధాంతరంగా మధ్యలో వదిలేసి వెళ్లిపోయాడు. మురుగునీరు వెళ్లిపోవడానికి ప్రత్యామ్నాయ మార్గాలు చూపకపోవడంతో దిగువన నివసిస్తున్న కుటుంబాలు అనారోగ్యం బారిన పడుతున్నాయి. డ్రైనేజీలు నిండిపోవడంతో ఇంటి వాకిళ్లలోకి వ్యర్థాలు వచ్చి చేరుతున్నాయి. దీంతో డ్రైనేజీల ముందు నివసిస్తున్న వారు ముక్కు మూసుకుని, తలుపులు వేసుకుని ఇళ్లలోనే ఉండిపోతున్నారు. మురుగునీరు ఇళ్ల ముందు నిలిచిపోవడంతో నాచుకట్టి దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి.

ఇదే విషయాన్ని రెండు వారాలుగా భీమిలి జోనల్ అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నా స్పందించడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా డ్రైనేజీలు, సీసీరోడ్ల నిర్మాణానికి తీసుకొచ్చిన మెటీరియల్ ఇళ్ల ముందు వదిలేయడంతో రాకపోకలకు అవస్థలు పడుతున్నామని వాపోతున్నారు.

పల్లపు ప్రాంతానికి వదిలిపెట్టాలి..

డ్రైనేజీ నిర్మాణం కోసం తీసుకొచ్చిన గ్రావెల్‌ను అక్కడే కుప్పలుగా వదిలేయడంతో మురుగునీరు పల్లం వైపు వెళ్లకుండా ఇళ్ల ముందు నిలిచిపోయింది. డ్రైనేజీ నిర్మాణం చేపట్టే వరకు మురుగు వ్యర్థాలు నిల్వ లేకుండా చేసేందుకు జేసీబీ సాయంతో అసంపూర్తిగా వదిలేసిన చోట తాత్కాలికంగా గ్రావెల్ తొలగించాలని స్థానికులు వార్డు సచివాలయాల ద్వారా ఫిర్యాదు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. పల్లపు ప్రాంతానికి మురుగునీటిని పంపిస్తే ఇళ్ల ముందు ఇబ్బంది తగ్గుతుందని కృష్ణాకాలనీ, గొల్లల పాలెం ప్రజలు అంటున్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత మూలకుద్దు జట్టు



క్రీడాకారులతో ముత్తంశెట్టి మహేష్, తదితరులు

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు చిల్లపేటకు చెందిన దివంగత ఆర్మీ ఉద్యోగి ధర్మాల ధనుంజయ్ మణికంఠ రెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన జ్ఞాపకార్థం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విన్నర్స్‌గా మూలకుద్దు జట్టు రూ.25 వేలు నగదు ట్రోఫీ గెలుచుకుంది. రన్నర్స్‌గా సిటీనగర్ జట్టు రూ.15వేలు, 3, 4వ స్థానాల్లో నిలిచిన పరదేశిపాలెం, చిల్లపేట జట్లు వరుసగా రూ.6 వేలు, రూ.5 వేలు నగదు బహుమతులతోపాటు ట్రోఫీలు గెలుచుకున్నాయి. మణికంఠరెడ్డి కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ కార్మిక సంఘం అధ్యక్షుడు జీరు వెంకట కైలాసరెడ్డి, చిల్లపేట యూత్ సహకారంతో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో వంద జట్లు పాల్గొన్నాయి. ఆదివారం నిర్వహించిన బహుమతుల పంపిణీలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, 2వ వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, నాయకులు బింగి హరికిరణ్‌రెడ్డి, సరగడ శివాంజనేయరెడ్డి, మునకాల ఆదినారాయణరెడ్డి, దల్లి అప్పలరెడ్డి, కొల్లి కోటిరెడ్డి, చిల్ల ఆదినారాయణరెడ్డి, కొయ్య రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని యువకుడి దుర్మరణం

పీఎం పాలెం: జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఓ యువకుడు ఘటనా స్థలిలోనే దుర్మరణం చెందాడు. శనివారం అర్ధరాత్రి 2 గంటల సమయంలో జరిగిన ఈ ప్రమాదానికి సంబంధించి పీఎం పాలెం పోలీస్ స్టేషన్ సీఐ వై.వెంకటరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొమ్మాది కార్పెంటర్ కాలనీలో నివసిస్తున్న గారి వెంకటరావుకు ఇద్దరు కుమారులు కాగా చిన్న కుమారుడు ప్రసాదు (28) అవివాహితుడు. కారు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. తన బైక్‌పై శనివారం సాయంత్రం ఆనందపురం మండలం పెద్దిపాలెం వివాహానికి వెళ్లాడు. రాత్రి 2 గంటల సమయంలో తెరిగి వస్తూ... కొమ్మాది కూడలిలో మారికవలస వైపునకు యూ టర్న్ తీసుకుంటుండగా నగరం వైపు నుంచి ఆనందపురం వైపునకు వెళ్తున్న గుర్తు తెలియని భారీ వాహనం ఢీకొట్టడంతో తీవ్ర గాయాలపాలైన ప్రసాదు సంఘటన స్థలంలోనే మరణించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతుని అన్నయ్య శ్రీను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్నివాల్

ఆనందపురం : హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో మండలంలోని గంభీరంలో ఉన్న హరేకృష్ణ వైకుంఠ మందిరం నిర్మాణ ప్రదేశంలో సోమవారం నుంచి విద్యార్థులకు సాంస్కృతిక కార్నివాల్ నిర్వహించనున్నామని ఆ సంస్థ అధ్యక్షుడు భక్తదాస తెలిపారు. ఈ నెల 28న 1, 2 తరగతుల విద్యార్థులకు రంగులు వేసే పోటీలు, 29న ఉదయం 5, 6, 7 తరగతుల విద్యార్థులకు స్వర సంగీతంలో, మధ్యాహ్నం 8, 9, 10 తరగతుల విద్యార్థులకు గాత్ర సంగీతంలో, 31న ఉదయం 3, 4 తరగతుల విద్యార్థులకు కలరింగ్‌లో పోటీలు ఉంటాయని చెప్పారు. అలాగే సెప్టెంబర్ 1న ఉదయం 1, 2, 3, 4 తరగతుల విద్యార్థులకు గీతా శ్లోక పఠనం, మధ్యాహ్నం 8, 9, 10 తరగతుల విద్యార్థులకు పెయింటింగ్‌లో, 2న 5, 6, 7 తరగతుల విద్యార్థులకు గీతా శ్లోకపఠనం, 3న ఉదయం 1, 2, 3, 4 తరగతుల విద్యార్థులకు పౌరాణిక వస్త్ర అలంకరణపై, మధ్యాహ్నం 8, 9, 10 తరగతుల విద్యార్థులకు గీతా శ్లోక పఠనంపై పోటీలు ఉంటాయని వివరించారు. అన్ని పోటీలకు ప్రవేశం ఉచితమని, పాల్గొనే వారందరికీ ప్రశంసా పత్రాలు అందజేస్తామని చెప్పారు. పూర్తి వివరాలకు ప్రతినిధి బలరామ్ కృష్ణను 91541 70108లో సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

పబ్లిక్ డిమాండ్

బోరుబావికి మరమ్మతులు చేపట్టండి

తగరపువలస: భీమిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా బీఎంఎల్ బీ 17 బోరుబావి రెండు వారాలుగా పనిచేయడం లేదు. దీంతో స్థానికులు తాగు, వాడుక నీటి కోసం తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల ఈ బోరుబావికి మరమ్మతులు నిర్వహించినా వెంటనే మొరాయించింది. ఇప్పటికైనా పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టి స్థానికులకు అందుబాటులోకి తీసుకురావాలి.

– బనిశెట్టి సతీష్, సుభాష్‌వీధి, భీమిలి



భీమిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదురుగా పనిచేయని బోరుబావి

పారిశుధ్య పనులు చేపట్టాలి

తగరపువలస: జీవీఎంసీ మధురవాడ జోన్ పీఎం పాలెం పరిధిలోని ఎస్సీ ఎస్టీ ఎంప్లాయీస్ లే అవుట్, అశోక్‌నగర్‌లో పారిశుధ్యం క్షీణించింది. రహదారులు శిథిలం కావడంతో మురుగునీరు, వర్షం నీరు రోడ్లపై నిలిచిపోతోంది. క్లాప్ వాహనాలు కూడా రాకపోవడంతో రోడ్ల పక్కన చెత్త పేరుకుపోతోంది. ముఖ్యంగా పారిశుధ్య పనులు ఎప్పటికప్పుడు చేపడితే వ్యాధులు ప్రబలవు. సంబంధిత అధికారులు స్పందించి రహదారులకు మరమ్మతులు చేపట్టి, పారిశుధ్య పనులు చేపట్టాలి.

– డి.భాస్కర, పీఎం పాలెం



ఎస్సీ ఎస్టీ ఎంప్లాయీస్ లే అవుట్ రహదారిపై బురదనీరు

వాకర్స్‌కు బ్రహ్మకుమారీల రాఖీలు



శిల్పారామంలో బ్రహ్మకుమారీలతో వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

పీఎం పాలెం : పవిత్ర రక్షా బంధన్‌ను పురస్కరించుకుని విశాఖ నగర ప్రజాపిత బ్రహ్మకుమారీస్ ఆదివారం శిల్పారామం (జాతర)లో స్థానిక వాకర్స్ అసోసియేషన్ సభ్యులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. వాకర్స్ సంఘం అధ్యక్షులు అల్లూరి ప్రభాకరరాజు, అరవింద్, తెంటు సూర్యనారాయణ, ఆదినారాయణ, నారాయణ స్వామి, గోవింద్ రాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉత్సాహంగా పోటీలు



పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

కొమ్మాది: వచ్చేనెల 6 నుంచి 8 వరకు బీచ్‌రోడ్డు సాగర్‌నగర్ ఇస్కాన్ మందిరంలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలను పురస్కరించుకుని ఆదివారం ఇక్కడి విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించారు. వ్యాసరచన, డ్రాయింగ్, కృష్ణలీలలపై పరీక్ష, భగవద్గీత శ్లోక పారాయణ, వంట, పూల అలంకరణ, రంగోలీ వంటి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు శ్రీకృష్ణాష్టమి రోజున బహుమతులు అందజేస్తామని ఇస్కాన్ అధ్యక్షులు సాంబదాస్ ప్రభూజీ, మాతాజీ నితాయి సేవిని తెలిపారు.

స్వచ్ఛ విశాఖే లక్ష్యం



కార్యక్రమంలో సాయికాంత్ వర్మ, తదితరులు

కొమ్మాది: స్వచ్ఛ విశాఖకు ప్రతి ఒక్కరూ సహకరించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ పిలుపునిచ్చారు. ఆదివారం ప్రముఖ పర్యాటక ప్రాంతం రుషికొండ బీచ్‌లో రోటరాక్ట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాగరతీర స్వచ్ఛత కార్యక్రమంలో ఆయన పాల్గొని తీరం వెంబడి ఉన్న వ్యర్థాల ను తొలగించారు. నగరంలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తి స్థాయిలో నిషేధించేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. తీరంలో 3.5 టన్నుల వ్యర్థాలు సేకరించారు. అడిషినల్ కమిషనర్ సన్యాసిరావు, జెడ్సీ కనక మహాలక్ష్మి పాల్గొన్నారు.

తప్పిన ప్రమాదం



కారుషెడ్ కూడలిలో డివైడర్ పైకి చేరిన కారు

పీఎం పాలెం: కారుషెడ్ కూడలిలో ఆదివారం సాయంత్రం 4 గంటల సమయంలో జాతీయ రహదారిపై పెద్ద రోడ్డు ప్రమాదం తప్పింది. కొమ్మాది కూడలి నుంచి నగరం వైపునకు వెళ్తున్న కారును వెనుక నుంచి వస్తున్న వాహనం ఢీకొనడంతో కారు డివైడర్ పైకి దూసుకుపోయింది. ఈ ఘటనలో కారు నుజ్జవగా అందులో ప్రయాణిస్తున్న వారు సురక్షితంగా బయటపడ్డారు. స్థానిక ట్రాఫిక్ ఏఎస్ఐ ఎం.సతీష్ వెంటనే స్పందించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా సంఘటన స్థలం నుంచి కారును తరలించడానికి చర్యలు చేపట్టారు.

మైదానం బురదమయం



బురదమయమైన చంద్రంపాలెం హైస్కూల్ మైదానం

మధురవాడ: చంద్రంపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆట స్థలంలో నీరు నిల్వ లేకుండా చేసేందుకు చేస్తున్న ప్రయత్నాలు ఏవీ పూర్తి స్థాయిలో ఫలిస్తున్నట్టు కనిపించడం లేదు. చిన్నపాటి వర్షం కురిసినా మైదానంలో నీరు నిలిచిపోయి గ్రౌండ్ బురదమయంగా మారిపోతోంది. విద్యార్థులు నడవడానికి కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీంతో ఎంతో ప్రతిభ కలిగిన క్రీడాకారులకు కూడా ఆటల్లో శిక్షణ, సాధనకు సరైన వేదిక లేకుండాపోయింది. సుమారు 3,800 మంది విద్యార్థులున్న ఈ పాఠశాలలో పిల్లలు ప్రార్థన చేసేందుకు కూడా ఇబ్బందులు ఎదురవ్వడంతో గదుల్లోనే ప్రార్థన చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి మైదానం ఎత్తు పెంచి అందుబాటులోకి తీసుకొచ్చేందుకు పూర్తి స్థాయిలో చర్యలు చేపట్టాలని విద్యార్థులు, పరిసర ప్రాంత క్రీడాకారులు కోరుతున్నారు.

వర్షపు నీటి నిల్వతో ఇక్కట్లు



రేవిడి పీహెచ్‌సీ సమీపంలో మలుపు వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

పద్మనాభం: పద్మనాభం – మహరాజుపేట ఆర్అండ్‌బీ రోడ్డుపై పలు చోట్ల వర్షపు నీరు నిల్వ ఉండిపోతోంది. దీంతో రాకపోకలు సాగించడానికి వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటల సమయంలో 15 నిమిషాలపాటు వర్షం కురిసింది. ఈ వర్షానికి కురపల్లి, రేవిడి పీహెచ్‌సీ సమీపంలో మలుపు, సచివాలయం వద్ద రోడ్డుపై నీరు నిల్వ ఉండిపోయింది. వర్షం కురిసినప్పుడల్లా ఈ ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంటోంది. ఈ మార్గంలో తగరపువలస, భీమునిపట్నం, విశాఖపట్నం ప్రాంతాలకు ద్విచక్ర వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. వర్షపు నీరు నిల్వ ఉండడం వల్ల ఎదురెదురుగా వాహనాలు వచ్చేటప్పుడు నీరు తుళ్లి వాహన చోదకులపై పడుతోంది. సంబంధిత అధికారులు స్పందించి నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

దాడి కేసులో నిందితులను శిక్షించాలి



సీఐ సన్యాసినాయుడుతో మాట్లాడుతున్న అల్లూరి సైనిక ఫెడరేషన్ సొసైటీ సభ్యులు

పద్మనాభం: మండలంలోని రేవిడి పంచాయతీ రౌతులపాలెంకు చెందిన మాజీ సైనికుడు మోపాడ ఆదినారాయణపై జరిగిన దాడి కేసులో త్వరగా విచారణ చేపట్టి నిందితులను కఠినంగా శిక్షించాలని ఉత్తరాంధ్ర అల్లూరి సైనిక ఫెడరేషన్ సొసైటీ సభ్యులు సీఐ ఎన్.సన్యాసినాయుడును కోరారు. ముందుగా వీరు రౌతులపాలెంలో ఉన్న ఆదినారాయణ ఇంటికి వెళ్లి పరామర్శించారు. దాడి జరిగిన విషయాలను, ఇతర వివరాలను ఆదినారాయణను అడిగి తెలుసుకున్నారు. తదుపరి దాడి జరిగిన పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం పద్మనాభం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి కేసును త్వరగా విచారించి నిందితులను శిక్షించాలని, అప్పటి వరకూ ఆదినారాయణకు రక్షణ కల్పించాలని సీఐ సన్యాసినాయుడును కోరారు. సైనికులు, మాజీ సైనికులు సీఐను కలిశారు.

ఉల్లాసంగా యూత్ అసోసియేషన్ ట్రెక్కింగ్



రిచెడ్ షర్మన్‌కు నివాళులర్పిస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఆనందపురం : మండలంలోని గంభీరం జలాశయం కొండపై యూత్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా విశాఖ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ట్రెక్కింగ్ ఉత్సాహపూరితంగా సాగింది. యూత్ అసోసియేషన్ జూబ్లీ ఉత్సవాల్లో భాగంగా కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కంబాల కొండ వద్ద ట్రెక్కింగ్ చేసే సభ్యులు వాహనాలపై ర్యాలీగా బయలుదేరగా సెంచూరియన్ యూనివర్సిటీ వీసీ ఆచార్య జీఎస్ఎన్ రాజు జెండా ఊపి ప్రారంభించారు. నగరానికి 20 కిలో మీటర్ల దూరంలో ఉన్న గంభీరం జలాశయం వద్దకు చేరుకొని... దానికి ఆనుకొని ఉన్న కొండపై ట్రెక్కింగ్ నిర్వహించారు. 10 మంది మహిళలు, 20 మంది యువతతోపాటు 84 మంది సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసీ రాజు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ, నీటి కొరత, నీటి పొదుపు వంటి అంశాలపై సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా యూత్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు రిచెడ్ షర్మన్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అసోసియేషన్ చేస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో పాల్గొన్న అందరికీ ప్రశంసాపత్రాలను అందజేస్తామని తెలిపారు. నీటిని ఒడిసి పడదాం – పర్యావరణాన్ని కాపాడుదాం అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో జిల్లా చైర్మన్ కేవీ రాజు, ఉపాధ్యక్షుడు పి.నగేష్, గౌరవ సలహాదారు రజనీ కాంత్, కార్యదర్శి ఇబ్రహీం, కోశాధికారి ఎన్.నాగేశ్వరరావు, నిర్వాహక కార్యదర్శి షాజహాన్, సభ్యులు సైదా ముఖేష్ పాల్గొన్నారు.

'జగనన్నకు చెబుదాం'తో తక్షణ పరిష్కారం



కాలనీలో సమస్యలు తెలుసుకుంటున్న సచివాలయ కార్యదర్శి శ్రావణి, నాయకులు

మధురవాడ: 'జగనన్నకు చెబుదాం' 1902 టోల్ ఫ్రీ నంబర్‌తో సమస్యలకు తక్షణ పరిష్కారం లభిస్తోందని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ 5వ వార్డు మారికివలస ఆర్‌జీకే కాలనీలో కొద్ది రోజులుగా వీధిలైట్లు వెలగడం లేదు. ఎవ్వరూ పట్టించుకోలేదు. దీంతో 78వ నంబరు వార్డు సచివాలయం కన్వీనర్ రుషికేశ్వరరావు 1902కి ఫిర్యాదు చేశారు. కార్యదర్శి ఎం.శ్రావణి తక్షణమే స్పందించారు. తాను ఇన్‌చార్జి విధులు నిర్వహించడంతో విషయం తన దృష్టికి రాలేదని అని చెప్పారు. అనంతరం విషయాన్ని విద్యుత్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి గంటల వ్యవధిలో సమస్య పరిష్కరించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆకట్టుకున్న శాస్త్రీయ నృత్య ప్రదర్శన



శిల్పారామంలో శాస్త్రీయ నృత్య ప్రదర్శనలో కళాకారులు

పీఎం పాలెం : వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం 6 గంటలకు శిల్పారామం (జాతర)లో ప్రదర్శించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఆద్యంతం అలరించింది. నగరంలోని నాట్య తరంగిణి డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో మూషిక వాహన నృత్యాంశంతో ప్రదర్శన ప్రారంభమైంది. కళాకారులు విష్ణువర్ధన్ రెడ్డి, షాన్వీ, ఈశ్విత, రాణి, చంద్రాణి, మాధురి, దేదీప్య, చందు, ఇందు, మేధ, హర్షిణి, ప్రియ, భవ్య, తదితరులు పాల్గొనగా ఎస్.లీలావతి నృత్య దర్శకత్వం వహించారు.

విద్యుత్ సర్వీసులకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి

ఆనందపురం : విద్యుత్ వినియోగదారులు అందరూ తమ సర్వీసులకు ఆధార్‌ను అనుసంధానం చేసుకోవాలని మండల ఏఈఈ సురేష్ కుమార్ చెప్పారు. ఈ మేరకు ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారని వివరించారు. స్థానికంగా ఉన్న లైన్‌మేన్ వద్ద, విద్యుత్ కార్యాలయంలో, బిల్లు కలెక్టర్ వద్ద, ఈస్టర్న్ పవర్ యాప్‌లో, ఏపీఈపీడీసీఎల్ వెబ్‌సైట్‌లో ఆధార్‌ను అనుసంధానం చేసుకోవడానికి అవకాశం ఉందని తెలిపారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి తమతో సహకరించాలని కోరారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

విద్యుత్ లైన్లకు మరమ్మతులు చేపడుతున్న దృష్ట్యా మండలంలోని వేములవలస, ఆనందపురం పరిసర ప్రాంతాలకు సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకూ విద్యుత్ సరఫరా ఉండదని ఏఈఈ సురేష్ కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

ముగిసిన హిందీ పరీక్షలు



పరీక్ష రాస్తున్న విద్యార్థులు

తగరపువలస: దక్షిణ భారత హిందీ ప్రచారసభ – చెన్నై ఆధ్వర్యంలో సెప్టెంబర్ 9, 10న నిర్వహించనున్న పరీక్షలకు సంబంధించి ఈ నెల 20, 27న ప్రీ ప్రైమరీ పరీక్షలు ముగిశాయి. ఈ సందర్భంగా భీమిలి ఆదర్శ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు, గౌరవ అధ్యక్షుడు గంటా నూకరాజు మాట్లాడారు. దేశంలో హిందీ ప్రామాణికంగా తీసుకుని ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నారన్నారు. అందువల్ల హిందీ భాషను నిర్లక్ష్యం చేయకుండా ప్రతీ విద్యార్థి నేర్చుకోవాలని సూచించారు. లోయర్, హయ్యర్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు సెప్టెంబరు 3న హాల్ టిక్కెట్లు జారీ చేస్తామని తెలిపారు.